# గురుదక్షిణ

“ఆ రోజు....ఎం.సెట్ పరీక్ష రాయటానికని బయలుదేరాను. అప్పటికే ఎండ చుర్రుమంటోంది. టైము దాటకుండా చేరుకోవాలనే ఆదుర్దాతో వేగంగా నడుస్తున్నందువలన కూడా విపరీతంగా చెమటలు పట్టి ఆయాసం వచ్చేసింది. ఇంకా సగం దూరం పైనే వుంది.ఏమైతే అదే అవుతుందిలే ...అనుకుంటూ దూరం నుండి వస్తోన్న ఆటో ను చూసి ఆపే ప్రయత్నం చేసాను. అందులో ఒకాయన ఉండటంతో ఉసూరుమంటూనే, నా సమస్య ఆటో డ్రైవరుకు చెప్పాను. అటూ ఇటూ చూసినతను లోపల వున్నాయనతో ' ఇతన్ని పరీక్ష సెంటరు దగ్గర దింపేసి, తర్వాత మిమ్మల్ని సినిమాహాలు దగ్గర దింపుతానండీ...' అని వినయంగా చెప్పాడు.దానికాయన చిరాకు పడ్డాడు. ' నా ఒక్కడి కోసం మాట్లాడుకున్నాను. ఇంకొకరినీ ఎక్కించుకుని వాళ్ళను దింపాక నన్ను తీసుకెళ్తానంటే...సినిమా మొదలైపోతే, నా పరిస్థితి ఏంటీ...నీకేం, నష్టం నాకేగా...'.

' అయితే ఒక పని చేద్దాం సార్...ఈ స్టూడెంట్ కి టైము దాటితే, ఒక సంవవత్సరం వృధా అవుతుంది. మీకలాంటి సమస్య లేదు. కొంచెం ఆట అయిపోయినా నష్టం ఏమీ లేదు...బావుంటే మళ్ళీ ఒకసారి పూర్తిగా చూసే ఛాన్స్ ఉండనే ఉంటుంది. బాగా లేకపోతే, తలనొప్పి కొంత తగ్గిందని సంతోషించొచ్చు ! సగం దూరం పైగానే తీసుకువచ్చాను. అయినా నాకేం ఇవ్వనవసరం లేకుండా దిగి, ఇంకో ఆటో చూసుకుని వెళ్ళండి సార్..అర్ధం చేసుకోండి...' ప్రాధేయపూర్వకంగా అన్నాడు.ఆయన అటూ ఇటూ చూసి ఏ ఆటో రావటం లేదని గ్రహించి కాబోలు లౌక్యంగా ' భలేవాడివయ్యా...సర్లే..నీ మాటే కానీయ్..ఇతన్ని దింపే వెళ్దాంగానీ, మరి తొందరగా పోనీయ్...' అన్నారు కొంచెంగా నవ్వి.నేను డ్రైవరు వైపు కృతజ్ఞతగా చూసి, లోపల వున్నాయనకూ నమస్కరించినట్లుగా తలవొంచి అభివాదం చేసి, ఆటో ఎక్కి కూర్చున్నాను. సెంటరు దగ్గర దిగాక జేబులు తడిమి చూసుకుని ' కంగారులో పర్సు ఇంటిదగ్గరే మర్చిపోయినట్లున్నానన్నా...' అని నసుగుతుంటే, లోపల వున్నాయన ఫక్కుమని నవ్వి ' బాడుగలు రెండు వస్తాయని ఆశ పడితే, శాస్తి బాగా జరిగిందిలే ' అన్నారు డ్రైవరుతో. డ్రైవరు మాత్రం నా భుజం తట్టి ' తమ్ముడూ....నిన్ను డబ్బుల కోసం ఎక్కించుకోలేదు.ఏ ఆలోచనలూ పెట్టుకోకుండా పరీక్ష ప్రశాంతంగా రాయి...' అన్నాడు చిరునవ్వుతో.

' హమ్మయ్య ' అనుకుంటూ తేలికపడిన మనసుతో లోపలకు పరుగు పెట్టేసాను.

*****

పరీక్ష బాగానే రాసాను. అయినా నాకేం సంతృప్తిగా, ఆనందంగా అనిపించటంలేదు. మంచి ర్యాంకు వచ్చినా...నేను చదవగలుగుతానో, లేదో తెలీయదు...మా ఆర్థిక పరిస్థితి అలాంటిది మరి ! మా నాన్న చిన్నతనంలో చనిపోయాడు. వెనుక ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. అమ్మకు చదువేంలేదు. నన్ను ఎలాగైనా చదివించాలనే తపన మాత్రం ఉంది. ఏవో చేతనైన చిన్న చిన్న పనులు చేస్తూ, చాలీచాలని సంపాదనతో రోజులు నెట్టుకొస్తోంది...! ఆ భగవంతుడు మాకే ఇలాంటి దారిద్ర్యాన్ని ఎందుకు అంటగట్టాడోననే అక్కసు, చిరాకు నన్నెపుడూ వేధిస్తుంటాయి ! దానికి దేముడి తర్వాత కారణం మా తల్లిదండ్రులేనని కూడా అనిపిస్తుంటుంది ! అర్థాంతరంగా నాన్న చనిపోయాడు. అమ్మదేమో అరకొర సంపాదన ! అలా ఆలోచనలతో పరధ్యానంగా నడుస్తున్న నా పక్కగా ఓ ఆటో వచ్చి ఆగింది. పరీక్షకు ముందు నన్ను తన ఆటోలో ఎక్కించుకున్నతనే ఆటో దిగి ' తమ్ముడూ....పరీక్ష బాగా రాసావా...?' అంటూ వాకబు చేసి, మా ఇల్లు ఎక్కడో కనుక్కుని ' నేనూ అటే వెళ్తున్నాను...ఆటో ఎక్కు..నిన్ను ఇంటి దగ్గర దింపుతా...' అన్నాడు.

నాకు గుండెల్లో రాయి పడినట్లయింది ! అతను ఇంటి వరకూ వస్తే, రెండుసార్ల ప్రయాణాలకీ కలిపి డబ్బు ఇవ్వాల్సి వస్తుంది ! “ఉదయం మా అమ్మ ఆటో డబ్బుల కోసం ఇంట్లో వెతికి చిల్లర పోగేస్తుంటే, నాకు చిరాకొచ్చి ' నడిచి వెళ్తాలే...' అంటూ కోపంగా బయలుదేరాను. పర్సు మర్చిపోవటమనేది ఆపద్ధరంగా చెప్పిన అబద్ధం...!” గత్యంతరం లేక ఆ విషయం అతనికి చెప్పేసాను !

' నీ దగ్గర డబ్బులు తీసుకోవాలనుకోలేదు తమ్ముడూ...ఖాళీగా వెళ్తున్నా కదాని రమ్మన్నాను. చదువుకునే స్టూడెంట్స్ తో కబుర్లు కలపటమంటే నాకు చాలా ఇష్టం...! నువ్వు ఒక అబద్ధాన్ని కప్పి పుచ్చటానికి మరో కట్టుకథ చెప్పకుండా నిజాయితీగా నిజం చెప్పినందుకు...నీ మీద నా స్వంత తమ్ముడిపై కలిగే ఇష్టం లాంటిదే ఏర్పడింది ! ' అన్నాడతను ఆప్యాయంగా భుజం మీద చెయ్యి వేసి. నేను సంకోచించకుండా సంతోషంగా ఆటో ఎక్కేసాను. అతనడిగిన వివరాలకి జవాబుగా, దిగజారిన మా అర్థిక పరిస్థితీ, నా ఆలోచనలూ...అన్నీ అరమరికలు లేకుండా చెప్పుకుపోయాను. అతను చిరునవ్వుతో విన్నాడు. ఆటోలో అతనికిరువైపులా రెండు స్టిక్కర్స్ ఉండటం చూసి, వాటిపై రాసివున్న కొటేషన్స్ నీ చదివాను. ఒకదానిపై ' దయగల హృదయమే దేవాలయం ' అనీ, రెండోదానిపై ' ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న ' అనీ ఉంది ! నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది ! వాటి గురించి అడుగుతూనే, అతని చదువులాంటి వివరాలను నేనూ వాకబు చేసాను. ' నేను చిన్నపుడు సాయంకాలాలు మా నాన్నమ్మతో కలిసి గుడికి వెళ్ళి పురాణ కాలక్షేపాల్ని శ్రద్ధగా వినేవాడిని. ఆ శాస్త్రి గారు చెప్పే పురాణ కథల ప్రభావం నా మనసు మీద చాలా వుంది !

పక్షులు విసర్జించే విత్తనాలవల్ల మొక్కలెన్నో మొలకెత్తి మనకు మేలు చేస్తాయట ! నాకో ఆలోచన వచ్చింది. నా ఆటోలో ప్రయాణించేవాళ్ళ పై కూడా ఇలాంటి మంచి మాటల ప్రభావం పడితే, సమాజానికి ఎంతో కొంత మేలు జరుగుతుంది కదానిపించింది ! వారానికోసారి ఈ కొటేషన్స్ మారుస్తుంటా. విత్తనాలకి మల్లే మంచి మాటలను వెదజల్లే ప్రయత్నం ఇది...! ' అంటూ చిన్నగా నవ్వాడు.నా ప్రశ్నలకి జవాబులుగా ఇంకొన్ని వివరాలూ చెప్పాడు. కుటుంబ పరిస్థితుల వలన పై చదువులు చదివే స్తోమత లేక ఇంటరుతోనే చదువు ఆపేశాడట. నాలాగే అతనికీ తండ్రి లేడు. ఇంటరు చదువుకి ఏ ఉద్యోగమూ దొరకదని, ఆటో నడుపుతూ ప్రైవేటుగా డిగ్రీ పూర్తి చేశానని చెప్పాడు. అయితే ఈ వృత్తితో కూడా ఆర్థిక పరిస్థితి చక్కబడటం వలన, అందులోనే ప్రస్తుతానికి కొనసాగుతున్నానన్నాడు.

ఆ తరువాత మా ఇంటి వీధి ముందున్న చిన్న గుడి అరుగుమీద కూర్చుని...నాకు ఓ సలహా కూడా ఇచ్చాడు.

' తమ్ముడూ....నీ మాటల్ని బట్టి నాకో విషయం అర్ధమైంది ! మీ పేదరికానికి కారణంగా నీ తల్లిని నిరసిస్తూ...పరిస్థితుల పట్ల నిరాశా నిస్పృహలను పెంచుకుంటున్నావు. అది మంచి పద్ధతి కానే కాదు ! ఒంటరిగా కష్టపడుతూ నీకు మంచి జీవితాన్నివ్వాలనే ఉద్దేశ్యంతో నిన్ను చదివించాలనుకుంటున్న తల్లి పట్ల అకారణ ద్వేషం ఎందుకూ...? పేదరికాన్ని అసహ్యించుకోవటం కాదు, అధిగమించటానికి ప్రయత్నం చేయాలని మన పెద్దవాళ్ళు చెప్పారు కూడా...! అవునా..? అందుకని నేనిచ్చే సలహా ఏమిటంటే...నీ తల్లి కోరిక తీరేలా బాగా చదువుకుని, మంచి ఉద్యోగంలో స్థిర పడగలిగితే, పరిస్థితులన్నీ అవే చక్కబడతాయి. నువ్వు ముందుగా నీ దారి మార్చాలి...నిరాశ, నిస్పృహల్ని వదిలి, ఆశావాదంలోకి అడుగు పెట్టు....' అంటూ ఉత్సాహపరిచే ప్రయత్నం చేసాడు.

అతని మాటలతో నాకు నిజంగానే హుషారొచ్చింది. ' పురాణ కథల సూక్తులు, పెద్దలమాటలూ చాలానే చెబుతున్నావు. పురాణాలు బాగా విన్నట్లున్నావన్నా...' అంటూ నవ్వాను. ' నువ్వు సరదాగా అన్నాగానీ, ఆ మాట నిజమే తమ్ముడూ...! అందుకేగా మంచి మాటల వ్యాప్తి అంటూ నా ఆటోలో ఇలా రాసి పెట్టుకున్నానూ...' అంటూ అతనూ నవ్వాడు. ఆ తరువాత ఒక కాగితం మీద ఏదో రాసి నా చేతికిస్తూ చెప్పాడు ' ఇది ప్రతిభావంతులైన పేద విద్యార్ధులని చదివిస్తూన్న సంస్థ అడ్రసు. నీ మార్కుల వివరాలతో వెళ్ళి కలిస్తే, నీ చదువు నిరాటంకంగా సాగిపోతుంది..' అన్నాడు. ఆ కాస్త పరిచయంలోనే అతనంత పెద్ద సాయం చేయటం చూసి నా కళ్ళు చెమర్చాయి. అతని చేతుల్ని పట్టుకుని ' నీ ఋణం ఎలా

తీర్చుకోగలనన్నా...' అన్నా కృతజ్ఞతగా చూస్తూ.  దానికతను పెద్దగా నవ్వాడు. ' తమ్ముడూ...ఋణాలంటూ పెద్ద మాటల అవసరం లేదు. ఎందుకంటే...నాలా పరిస్థితుల వల్ల చదువు కొనసాగించలేని వాళ్ళకి చేయూతగా ఏ చిన్న సాయం చేసినా..నాకారోజు అన్నం తినకపోయినా, మనసు నిండిన అనుభూతితో ఆనందంగా ఉంటుంది ! నా సంపాదనలో కొంత మిగిలినప్పుడు, దాన్ని ఆ సంస్థకు విరాళంగా ఇస్తుంటాను. నువ్వు ఋణం తీర్చుకోవాలనుకుంటే ఏముందీ, బాగా స్థిరపడ్డాక, నీకు చేతనైనట్లుగా విద్యార్థులకి సాయం చేయటమే! మన పెద్దవాళ్ళు చెప్పిందీ అదేగా...ఇతరులు మనకేది చేస్తే సంతోషం కలుగుతుందో, అదే మనమూ చెయ్యగలగాలీ...! అని. అవునా..?' అంటూనే మళ్ళీ పెద్దల మాట అంటూ చెప్పటం గుర్తొచ్చి కాబోలు పెద్దగా నవ్వాడు. నేనూ నవ్వుతూ సెలవు తీసుకున్నా. తర్వాత అతని ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేసానుకానీ ఫలించలేదు. నన్ను చదివించిన సంస్థ వాళ్ళకీ తెలియదన్నారు. నేను చదువు పూర్తి చేసి, మంచి ఉద్యోగంలో స్థిరపడటమే కాదు, నేను పనిచేస్తున్న కంపెనీలోనే భాగస్వామిని కాగలిగాను!

ఇందుకు కారణం ...కేవలం ఒక ఆటో డ్రైవరు ప్రేమతో నాకు చూపించిన ఆశావాద మార్గమే కారణమనుకుంటాను! ఇదీ నా జీవిత కథ " అంటూ ముగించాను.

నా తోడ్పాటుతో చదువుకుని ఉద్యోగాలు సంపాదించుకున్న వాళ్ళు నలుగురు వచ్చి తమ కృతజ్ఞత తెలియజేయగానే, నా అలవాటు ప్రకారం నా జీవిత కథని వాళ్ళకి చెప్పి, చివరగా ఇంకో మాటా చెప్పాను. ' గొప్ప విద్యావేత్త కాకపోయినా , ఆ ఆటో డ్రైవరు నా మనసులో గురువుగా నిలిచిపోయాడు! విలువైన సలహాతో మార్గనిర్దేశం చేసినవాళ్ళు..మామూలువాళ్ళయినా విశిష్ట వ్యక్తులే !  అందుకే ఎవరికైనా సాయం చేయగలిగినపుడు...గురుదక్షిణ ఇచ్చిన సంతృప్తీ, సంతోషం నాకూ కలుగుతూంటాయి..!'

" అర్థమైంది సార్..మేమూ మీ మార్గాన్నే అనుసరించి, మీకూ మా గురుదక్షిణ చెల్లిస్తాం..!" అంటూ సెలవు తీసుకున్నారు. అప్పుడు నాకూ మనసు నిండిన అనుభూతితో ఆనందం వెల్లువైంది..!

******